ఒంటిమిట్టలో రేషన్ మాఫియా

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు



పట్టుకున్న రేషన్ బియ్యాన్ని ఒంటిమిట్ట గోడౌన్‌కు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఒంటిమిట్ట మండలంలో రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతోంది. పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్న పీడీఎస్ బియ్యం కొందరు పెద్దల ఆర్థిక ఆకలి తీరుస్తోంది. ఒంటిమిట్ట మండలానికి చెందిన అక్రమార్కుడు.. రేషన్ అక్రమ రవాణా దందా మొదలుపెట్టారు. మొదట్లో చాలా కష్టంగా సాగిన ఈ అక్రమ రవాణా.. పోనుపోను అతనికి సులువైన వ్యాపారంగా మారింది. గతంలో నాలుగు, ఐదు సార్లు ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో అతను దాచిపెట్టిన అక్రమ రేషన్ బియ్యం స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచుకున్న వారిపై జరిమానా విధించారు. ఆ తరువాత మూడేళ్లుగా వారిని పట్టుకునే వారే లేనట్టుగా.. వ్యాపారం సాగుతోందంటూ ఆ మండలాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఎందుకు పట్టుకోలేకపోతున్నారు?

మూడు ఏళ్ల కిందట ఒంటిమిట్ట మండలంలో పలు సార్లు పట్టుబడ్డ అక్రమ రేషన్ బియ్యం.. ఆ తర్వాత ఎందుకు పట్టు పడటం లేదని మండల ప్రజల్లో సందేహం నెలకొంది. అప్పట్లో దొరికిన వీరు ఇప్పుడు ఎందుకు దొరకడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ అక్రమ రేషన్ బియ్యం డంప్ చేసేందుకు పక్క మండలాలను ఆశ్రయిస్తున్నారా.. లేక అధికారులు, సిబ్బందికి ముడుపులు చెల్లించారా అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలా కాకుంటే సంబంధిత నిర్మూలన వ్యవస్థ అధికారులు నిద్ర పోతున్నారా అనే అనుమానాలు మండల ప్రజల్లో చోటు చేసుకుంటున్నాయి.

గూఢాచారుల సమాచారాన్ని సైతం..

ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా తెలిసిన కొంత మంది గూఢాచారులు ఎంతో నమ్మకంతో వారికి తెలిసిన అధికారులు, సిబ్బందికి తెలియజేస్తున్నారు. ఆ సమాచారాన్ని కూడా కొంత మంది అధికారులు, సిబ్బంది అక్రమార్కులకు అందజేసి.. వారి వద్ద నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఎక్కడైనా అవినీతి, అక్రమాలు జరిగితే గూఢాచారులు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామంటూ చెప్పుకొచ్చే కొన్ని ప్రభుత్వ వ్యవస్థలు వాటిని పక్కన పెట్టినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని కొంత మంది గూఢాచారులు 'సాక్షి'కి తెలియజేసి తమ ఆవేదన వెలిబుచ్చారు.

అక్రమార్కుడికి భారీ ఆదాయం

కేవలం ఒక ఒంటిమిట్ట అక్రమదారుడు కడప నుంచి రైల్వేకోడూరు దాకా ఒక నెల సేకరించిన బియ్యాన్ని విక్రయిస్తే రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో నుంచి కొంత అధికారులకు ముట్టజెబుతున్నట్లు సమాచారం.

అమ్ముకున్న బియ్యాన్నే తింటున్న ప్రజలు

పేదల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని గోడౌన్ ద్వారా నూకలుగా తయారు చేసి.. అవే క్వాలిటీ బియ్యంగా అధిక రేట్లకు ప్రజలు కొనుగోలు చేసి తినేలా చేస్తున్నారని కొంత మంది వాపోతున్నారు. ఇలా ప్రజలు నాణ్యమైన బియ్యం అనుకొని.. వారు తక్కువ ధరకు అమ్ముకుంటున్న బియ్యాన్నే కొనుగోలు చేసి తింటున్నారనే సత్యాన్ని మరచిపోతున్నారని కొంత మంది చెబుతున్నారు. ఇకనైనా రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల ఆటలను సంబంధిత అధికారులు కట్టిస్తారా లేదా అని వేచి చూద్దాం.

చర్యలు తీసుకుంటాం



రేషన్ మాఫియా రవాణాకు సంబంధించి గూఢాచారులు ఇచ్చిన సమాచారాన్ని, వారి వివరాలను కొంత మంది స్థానిక అధికారులు, సిబ్బంది బహిర్గతం చేసి దుర్వినియోగం చేస్తున్న దానిపై సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. గూఢాచారుల సమాచారాన్ని, వారి వివరాలను బహిర్గతం చేసే ప్రసక్తే లేదు. అది చాలా నేరం. అలాగే ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలలో ఎక్కడ అక్రమ రేషన్ బియ్యాన్ని రవాణా చేసినా, డంప్ చేసినా స్థానిక ఎస్ఐ, సీఐల దృష్టికి తీసుకువస్తే తప్పకుండా మరుక్షణమే అక్రమ రవాణాను అరికడతాం.

\- బాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఒంటిమిట్ట

మాకు తెలియజేయండి

నేను కడప విజిలెన్స్ సీఐగా వచ్చి రెండు నెలలు అవుతుంది. గూఢాచారుల సమాచారం, వివరాలు బహిర్గతం చేశారని మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. అలాంటిది ఏదైనా ఉంటే మాకు తెలియజేయండి, తప్పక చర్యలు తీసుకుంటాం. అలాగే అక్రమ రేషన్ రవాణాను అరికట్టాలంటే గూఢాచారుల సమాచారం ఎంతో ముఖ్యం. అలాంటి సమాచారం ఉంటే మాకు తెలియజేయండి.

\- శివన్న, సీఐ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కడప

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె, లింగంపల్లె గ్రామాల మధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం సీతా, రామ, లక్ష్మణ, హనుమంత, వినాయక స్వాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి.. స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వేద పండితులు నూతన ఆలయంలో ధ్వజ స్తంభ, సీతా, రామలక్ష్మణ, హనుమంత, వినాయకస్వామి విగ్రహాలకు వేద మంత్రాలతో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాముల వారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, ప్రాతఃకాలపూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి కుంకుమార్చన, చండీహోమం, పూర్ణాహుతి వంటి పూజలు వేద మంత్రాలతో నిర్వహించారు. స్వామి వారికి భక్తులు కాయకర్పూరాలను సమర్పించి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, శివారెడ్డి, రెండు గ్రామాల పెద్దలు, మహిళలు, యువత, పెద్ద ఎత్తున పాల్గన్నారు.



రామాలయంలో స్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు దూరం

రాజంపేట టౌన్ : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు దూరం కాగలవని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హెచ్.కొత్తపల్లె పంచాయతీలో సర్పంచ్ చొప్పా లక్ష్మీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్.కొత్తపల్లె, హస్తవరం పంచాయతీల కార్యదర్శులు షేక్ మహమ్మద్ ఇబ్రహీం, సి.శ్రీనివాసులు, వార్డు మెంబర్ అక్కి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి

రామాపురం : ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లెలో నూతనంగా నిర్మించే గంగమ్మ ఆలయం సమీపంలో ఇంకుడు గుంతను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలో ఇంకిపోయి.. నీటి మట్టం పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు కలిసి ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం, ఏపీడీ నరేంద్రకుమార్‌రెడ్డి, ఏపీఓ పెంచలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఉపాధి సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర–స్వేచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

గుడి నిర్మాణానికి భూమిపూజ



ఇంకుడు గుంత ప్రారంభంలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీలో శ్రీ గంగమ్మ దేవత గుడి నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. అనంతర కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ జాషువా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని సుద్దమళ్ల పంచాయితీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బొమ్మిశెట్టి కిరణ్‌ను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. కిరణ్ పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బోరు

సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది

ఒంటిమిట్ట : ఓల్టా యాక్ట్ 2002 నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును శనివారం మండల రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసినట్లు తహసీల్దార్ వెంకటరమణమ్మ తెలిపారు. ఆమె వివరాల మేరకు... మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీలో గల ఏపీఎస్ కళాశాల సమీపంలో ఉన్న సర్వే నంబర్ 2173–5లో అవ్వారు సుబ్బమ్మకు 5 ఎకరాల భూమి ఉంది. ఆమెకు ఉన్న భూమిలో 2019లో ప్రభుత్వ నిబంధనల మేరకు బోరు వేసుకుని, అప్పటి నుంచి చీనీ, నిమ్మ తోటలను సాగు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే సుబ్బమ్మ పొలానికి పక్కనే సర్వే నంబర్ 2174లో ఉన్న మాలతి తన పొలంలో ఈ నెల 11న.. ఓల్టా యాక్ట్ 2002 నిబంధనలను ఉల్లంఘించి విరుద్ధంగా అవ్వారు సుబ్బమ్మ బోరుకు 60 మీటర్ల దగ్గరలోనే బోరును వేశారు. ఈ బోరు వల్ల సుబ్బమ్మ బోరుకు నీటి మట్టం తగ్గింది. దీంతో సుబ్బమ్మ 5 ఎకరాలలో సాగు చేస్తున్న ఉద్యాన పంటకు నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న అవ్వారు సుబ్బమ్మ ఈ నెల 12న కడప కలెక్టరేట్లో డీఆర్‌వోకు ఫిర్యాదు చేసింది. డీఆర్‌వో ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన మాలతికి సంబంధించిన బోరును స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, నరవకాటిపల్లి వీఆర్‌వో సుబ్బారెడ్డి కలిసి సీజ్ చేశారు. ఆ బోరును మరల వినియోగంలోకి తీసుకువస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బోరును సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

రైల్వేకోడూరు అర్బన్ : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లికి చెందిన తలారి ఈశ్వరయ్య అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకొన్న కొరముట్ల శనివారం రెడ్డివారిపల్లికి చేరుకున్నారు. ఈశ్వరయ్య మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కొరముట్ల

ఏఐటీయూసీ మహాసభలు విజయవంతం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంబశివ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో వారు శనివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మొదటి మహాసభకు కార్మికులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య తదితర నాయకులు హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య, జయచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆడపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 2025–26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ఆధార్ కార్డుతో మార్చి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఏప్రిల్ 6న ఉదయం 5వ తరగతి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష, అదే రోజు మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8688573067 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంచుకోవాలి

రామాపురం : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంచుకోవాలని బిట్స్ కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బిట్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం వైబ్‌సైట్ డిజైనింగ్ వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన క్యాష్‌న్ని సీఈఓ అబుబకర్ సిద్దిక్ జీరో కోడింగ్‌తో తక్కువ సమయంలో వైబ్‌సైట్‌ను ఎలా తయారు చేయాలో, తమ స్కిల్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించుకోవడానికి, ఐటీ రంగంలో రాణించడానికి దోహదపడేలా క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్‌కు దోహదపడేలా నిర్వహిస్తామని తెలిపారు.

నిందితుడికి రిమాండ్

సుండుపల్లె : మండల పరిధిలోని ఎగువ జగ్గంపల్లికి చెందిన సమ్మెట సతీష్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ నెల 12వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం సతీష్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచారు. నిందితుడికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

రైతుకు విశిష్ట గుర్తింపు తప్పనిసరి

సిద్దవటం : భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ కార్డు)ను పొందాలని బద్వేల్ సహాయ వ్యవసాయా సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

నందలూరు : ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు 11 అంకెలు గల విశిష్ట సంఖ్య కలిగి ఉన్న గుర్తింపు కార్డును ప్రభుత్వం అందజేస్తోందని మండల వ్యవసాయ అధికారి జి. మల్లికార్జున తెలిపారు. రైతులు తమ పేరు నమోదు చేసుకోవడానికి సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్ తీసుకెళ్లి వ్యవసాయశాఖ అసిస్టెంట్‌ను కలవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని వివరించారు.



గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



ముట్లూరు కిక్ (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీలో గల రైల్వేకాలనీలో నివాసం ఉంటున్న ముట్లూరు వెంకటేష్ చిన్న కుమారుడు ముట్లూరు కిక్ (11) ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి దగ్గర ఎవరూ లేని సమయంలో ముట్లూరు కిక్ సైకిల్‌తో ఆడుకుందామని అనుకున్నాడు. కానీ సైకిల్ తన ఇంటిపై ఉండటంతో కిందకు దించే క్రమంలో.. ఇంటి వసారు పైకి ఎక్కాడు. అయితే వసారుకు వేసిన ఇనుప రేకులకు తీగల ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో షాక్‌కు గురై ఇంటిపై నుంచి కింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కిక్ తల్లిదండ్రులు హుటాహుటిన ఇంటికి చేరుకోగా.. వికత జీవిగా ఉన్న తన కుమారుడిని చూసి బోరున విలపించారు. ముక్కు పచ్చలారని బాలుడు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



సంబేపల్లె : పాఠశాల పరిసరాలను విద్యార్థులతో శుభ్రం చేయిస్తున్న అధికారులు



నందలూరు : దుకాణాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

సంబేపల్లె : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ రామచంద్ర పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డితో కలిసి నిర్వహించారు. ఆ పాఠశాల పరిసరాలను విద్యార్థులతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం : ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ నుంచి ఎక్సైజ్ అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి, హరిత రాయబారులు జెడ్పీ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మెహతాబ్ యాస్మిన్, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అన్ని గ్రామాలతో పాటు మండల, గ్రామ స్థాయి కార్యాలయాల అధికారులు సిబ్బందితో కలిసి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రెడ్డెయ్య, ఎంఈఓ చక్రేనాయక్, పంచాయితీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరు : సింగారెడ్డిపల్లిలోని కంబాలకుంట కస్తూర్బా పాఠశాల రోడ్డుకు ఇరువైపులా జేసీబీతో కంపచెట్లను తొలగించి పరిశుభ్రం చేశారు. అలాగే మురికినీరు నిల్వ ఉన్న చోట జేసీబీతో గుంతతీసి ఆ నీరు గుంతలోకి వెళ్లేటట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, ఏపీఎం నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : స్థానిక బస్టాండ్ కూడలిలోని దుకాణాదారులతో ఎస్ఐ వెంకటేశ్వర్లు సమావేశమయ్యారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ షామీర్ బాషా, పోలీసులు దర్బార్ బాష, చెన్నయ్య, హోంగార్డు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల కేంద్రంలో ఎంపీడీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛ దివస్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సానిపాయి ఫారెస్టు కార్యాలయం సిబ్బంది చుట్టుపక్కల రక్షణ గోడల పక్కన ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరస్వతమ్మ, మండల స్థాయి అధికారులు, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీలో ఎంపీడీఓ మల్‌రెడ్డి తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, ఈఓపీఆర్‌డీ మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనుసూయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి చెత్తా చెదారాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సూపర్ వైజర్ ఎల్లమ్మ, ప్రేమలత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు సింధూర పూజలు, ఆకుపూజ తదితర పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

క్లుప్తంగా

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు ప్రణాళికలను రూపొందించాలని భారత ఆర్మీ సైనికుడు చెరుకు నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్లోబల్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ప్రొఫెషనల్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించడం.. విద్యార్థులో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ద్రాక్షాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

రైల్వేకోడూరు అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో సాయిడిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థిని అఫ్రీన్ మూడు బంగారు పతాకాలు సాధించింది. శనివారం అఫ్రిన్‌ను కళాశాల ప్రిన్సిపల్ పెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు అభిందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ చాంపియన్‌షిప్ స్కేటింగ్ 100, 500, 1000 మీటర్లలో ఈ విద్యార్థిని బంగారు పతకాలు సాధించిందన్నారు. ఈ నెల 24, 25, 25 తేదీలలో మధ్యప్రదేశ్‌లో జరిగే ఆల్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

సుండుపల్లె : రాయచోటి–సుండుపల్లి ప్రధాన రహదారిలోని అనుంపల్లి సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాయచోటి నుంచి సుండుపల్లి వైపు వస్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

18న ఇంటర్వ్యూలు

ఒంటిమిట్ట : మండలంలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 18న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ వారికి సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకురావాలని వివరించారు.

36 మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజంపేట : మండలంలోని కూచివారిపల్లె పంచాయతీ ఎన్‌టీఆర్ కాలనీలో ఓ వ్యక్తి నుంచి 36 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని రాజంపేట అర్బన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. బెల్టుషాపు నిర్వహకుడు గార్లపాటి వెంకటేశ్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా వాటిని శనివారం స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని అరెస్టు చేశామన్నారు. వైన్‌షాపుల వద్ద కాకుండా ఇళ్లు, దుకాణాల్లో మద్యం విక్రయించడం నేరమన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయండి

పెనగలూరు : ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలు పెంపొందించవచ్చని ఎంపీడీఓ విజయారావు అన్నారు. శనివారం సింగారెడ్డిపల్లిలో రేవతి అనే మహిళ పూర్తి చేసుకున్న ఇంకుడు గుంతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓ ఉమా మహేశ్వరరావు, ఎంపీడీఓ మాట్లాడుతూ మండలానికి 125 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఇప్పటికే కొన్ని పూర్తి అయ్యాయని, మిగిలినవి కూడా వెంటనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంటి పరిసరాలలో ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రామయ్య, వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం ఆటగాళ్ల అరెస్ట్

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న మామిడి తోటలో శనివారం సాయంత్రం కోడి పందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. తాను సిబ్బందితో వెళ్లి స్పెషల్ రైడ్ చేసి వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 2960 నగదు, ఒక పందెం కోడిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో కడప తిలక్ నగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు, ఒంటిమిట్టకు చెందిన ఒకరు, భాకరాపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.